# బావ

ఆ రోజు ఆదివారం. వారంరోజుల క్రితమే పద్మ, నేనూ ఝాన్సీ కీ రాణి సినిమాకు వెళ్ళాలని ప్రోగ్రాం వేసుకున్నాము. కొత్తగా వచ్చిన సినిమా- అందులో చాలా బాగున్న దని పేరు పొందింది. ఆలస్యంగా పోతే టిక్కెట్లు అందవని ఒంటిగంటకే ముస్తాబయి కూర్చున్నాను. రెండున్నర అయింది. ఇంకా పద్మ రాలేదు. "బస్" శబ్దమయినప్పుడల్లా బయటకు పోవటం, మళ్ళీ నిరాశతో లోపలకు రావటం. మూడు గంటల వరకు కాలు కాలిన పిల్లిలా తిరిగాను. చివరకు కోపంతో ఇంకెప్పుడూ పద్మను నమ్మి ఎక్కడకూ పోవాలనే నిర్ణయానికి రాకూడదని నిశ్చయించుకున్నాను. గది తలుపు బిగించి పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నిస్తున్నాను.

"టక్ టక్" మంటూ తలుపు శబ్దం వినిపిస్తున్నది. పద్మ వచ్చి ఉంటుందని, నాలుగు చీవాట్లు పెట్టిగాని సినిమాకు బయలుదేరకూడదనుకుంటూ తలుపు తెరిచాను. ఎదురుగా నిల్చున్న పోస్టుమాన్‌ను అమాంతం నమిలి మింగుదామా అన్నంత కోపం వచ్చింది. ఒక బరువైన స్టాంపులులేని కవరు చేతిలోపెట్టి అరణాలడిగాడు. నాకు పచ్చి పుండుమీద కారం పోసినట్లయి, 'అవసరం లేదు, తీసుకుపో' అందామనిపించింది. కాని అందులో ఏమున్నదో అనే జిజ్ఞాస నన్ను ఆ పని చేయనివ్వలేదు.

ఇంత బరువైన కవరు చూస్తుంటే ఒకవైపు ఏదో చెప్పలేని భయమూ, ఇంకోవైపు కుతూహలమూ ఒక్కుమ్మడిగా కలిగాయి. ఉత్తరం మొత్తం ఆరు పేజీలు. ముందు ఆదుర్దాగా ఆరు పేజీల చివరనున్న పేరు... "లలిత" ఆ ముత్యాల్లాంటి అక్షరాలూ చూశాను. వెంటనే కాలగర్భంలో కలిసిపోయిన కొన్ని స్మృతులు కళ్ళముందు కదలసాగాయి.

ఆరు సంవత్సరాల క్రితం నేను కాన్వెంటులో ఫిఫ్తుఫారం చదివే రోజులలో లలితతో నాకు పరిచయం కలిగింది. కొద్ది రోజుల్లోనే మా పరిచయం గాఢ స్నేహంగా మారింది. లలిత ఎప్పుడూ సంతోషంగా, చురుగ్గా ఉండేది. ఆమె ముఖం ఎప్పుడూ చిరునవ్వుతో కళకళలాడుతుండేది. స్కూల్లోని ప్రతివారిని ఆమె ఇట్టే ఆకర్షించేది. దానికి కారణం ఆమె అందమని చెప్పటానికి వీల్లేదు. చామనచాయ, సన్నగా పొడవుగా వుండేది. ఆమెలో చెప్పుకోతగ్గదల్లా భావపూరితాలైన ఆమె విశాల నేత్రాలు మాత్రమే.

వేసవి సెలవుల తర్వాత లలిత స్కూల్లో సిక్తు ఫారంలో చేరినప్పుడు అందరికీ ఆశ్చర్యం కలిగింది. ఆమెను చూస్తూంటే నాకు నిజంగా చెప్పాలంటే ఏడుపే వచ్చింది. ఎప్పుడూ కిలకిలా నవ్వే లలిత ఇప్పుడు నవ్వదు. ఎప్పుడూ భావకవిత్వము వుట్టిపడే ఆమె కళ్ళనుండి ఏదో మూగ వేదన కన్పిస్తుంది. ఎప్పుడూ చిరునవ్వుతో కళకళలాడే ఆమె వదనం ఏదో నిగూఢ ఆవేదనతో గంభీరంగా, కఠోరంగా తయారయింది. ఎవరితో

మాట్లాడదు. నవ్వదు. ఎంత ప్రయత్నించినా ఆమెలోని యీ మార్పుకు కారణం ఎవరికీ బోధపడలేదు. సిక్తుస్ఫారం పూర్తికాకముందే వాళ్ళ తండ్రి ఆకస్మాత్తుగా చనిపోయాడు. ఆ రోజు దృశ్యం నా హృదయాన్ని ఈ రోజూకూ మెలిపెడుతుంది. తండ్రి శవం దగ్గర వాళ్ళ అమ్మా, అక్కా, బావ అంతా ఘొల్లున ఏడుస్తున్నారు. లలిత మాత్రం తండ్రి తల దగ్గర కూర్చొని, ఎక్కడో చాలా దూరంగా, బహుశా అంధకారంలో మరుగునపడివున్న తన భవిష్యత్తును చూస్తూంది, రెప్పవాల్చని కళ్ళతో. కండ్లలో తడిలేదు, ఆవేదనలేదు. కరడుకట్టిన విరక్తి, ఘనీభవించిన నిరాశ కన్పిస్తున్నాయి ఆ విశాల నేత్రాల్లో.

మూడవరోజు లలిత మా ఇంటికి వచ్చింది. ఆమె ముఖంలో ఎలాంటి మార్పులేదు. అదే విరక్తి, నిరాశ వుట్టిపడుతోంది. అమ్మా, తనూ, వాళ్ళ అక్క బావలతో బెంగుళూరు వెళుతున్నామని చెప్పింది. ఏడుస్తున్న నన్ను చూసి ఆమె పెదవులు కొంచెం చలించాయి. అబ్బ, ఆ చిరునవ్వు చాటున ఎంత విషాదం దాగివుంది.

ఆ తర్వాత లలితను గురించి నాకేమీ తెలియదు. ఒక విధంగా ఆమెను మర్చిపోయినాననే చెప్పాలి. మళ్ళీ ఈరోజు లలిత ఉత్తరాన్ని చూస్తున్న కొద్దీ నా హృదయం ఆనందంతో ఉరకలు తీస్తోంది. చదవటం ప్రారంభించాను.

"ప్రియమైన జానకీ!"

నా ఉత్తరం చూడగానే నీకు ఆనందాశ్చర్యాలు కలుగుతాయని తెలుసు. కాని ఇన్ని సంవత్సరాల తర్వాత రాస్తున్న ఉత్తరం కూడ నీకు ఆనందాన్ని కలిగించేలాగ రాయలేక పోయినందుకు క్షమిస్తావు గదూ?

ఈపాటికి బహుశా నీవు నన్ను మర్చిపోయి ఉంటావు. కాని నేను మాత్రం నిన్ను మరవలేదంటే బహుశా నీవు నమ్మవేమో. నీవు తప్ప యీ విశాల ప్రపంచంలో నా హృదయవేదనను చెప్పుకోతగ్గ వాళ్లెవరూ లేరు. అందువల్లనే అచలంగా, గంభీరంగా ఉండే పర్వత గర్భంలో నిరంతరం ప్రజ్వలించే అగ్నిలాగానే, నా గంభీర హృదయం (మీరంతా అనుకున్నట్లు) చాటున ప్రజ్వలించే అగ్నిజ్వాలలను, ఇంక ఎక్కువ కాలం నీ దగ్గర దాచలేకపోయాను.

ఇలా నా విషాదగాథను నీకు చెప్పటం నా హృదయాగ్ని చల్లారుతుందనీ కాదు. లేక నాతోపాటు నిన్నుకూడా బాధపెట్టి నీ సానుభూతిని పొందాలనీగాదు. ఒక్కసారి పూర్తి ఉత్తరాన్ని చదివి మర్చిపో. ఎప్పుడైనా తీరిక ఉంటే నాలాంటి అభాగినులు ఎంతమంది యీ సమాజంలో పెద్ద మనుష్యుల్లాగ చెలామణి అయ్యే పురుషుల ఇనుప కాళ్ళక్రింద నలిగిపోతున్నారో తెలుసుకో ప్రయత్నించు. ఇక న్గా కథ విను.

అక్కా, నేనూ తప్ప మా తల్లి తండ్రులకు వేరే సంతానం లేదని నీకు తెలుసు. మా అక్క నా కంటె పది సంవత్సరాలు పెద్ద. అక్క పెండ్లి నాటికి నాకు అయిదు సంవత్సరాలు. మా బావ అప్పుడే బి.ఏ. ప్యాసయ్యాడు. బుద్ధిమంతుడనీ, అందంగా ఉంటాడనీ ఆస్తి ఏమీ లేకపోయినా అక్కను మా నాన్న అయనకిచ్చి పెండ్లి చేశారు. రెండు సంవత్సరాలు బావ ఉద్యోగం ఏమీ లేక మా ఇంట్లోనే ఉన్నాడు.

బావ నన్ను ముద్దుగా చూసేవాడు. రోజంతా నాతోనే ఆడుకునేవాడు. నేను బావను వదిలి ఒక్క క్షణం ఉండేదాన్ని కాదు. బావ అన్నం తినిపిస్తేగాని అన్నం తినేదాన్ని కాదు. బావ దగ్గర పడుకుంటేనేగాని నిద్రపోయేదాన్ని కాదు. బావను ఇలా ఇబ్బంది

పెడుతున్నందుకు అమ్మ ఒక్కోసారి నన్ను కొట్టేది. అమ్మమీద బావకు కోపం వచ్చేది నన్ను కొట్టినందుకు, ఎంతో ప్రేమతో లాలించి ఏడుపు మాన్పించేవాడు.

ఒకరోజు ఇంటిల్లీపాదీ దిగులుగా ఉన్నారు. అప్పటికి నాకు ఏడుయేళ్లు నిండాయి. బావ ఎవరికీ చెప్పకుండా మిలిటరీలో చేరాడట ఆరోజే. అమ్మా, నాన్నలతో కాశ్మీరు వెళుతున్నానని చెప్పాడు. రోజంతా అక్క అన్నం తినకుండా ఏడ్చింది. బావ ఏదో చెప్పి బుజ్జగించాడు.

ఆ రోజంతా నేను మాత్రం బావను వదల్లేదు. బావ మంచి మంచి చాక్‌లెట్లు తినిపించాడు. స్టేషన్లో బావ నన్ను నాన్న చేతికి అందించి తను రైలెక్కాడు. నేను చేతుల్తో, కాళ్లతో నాన్నను తంతూ కొడుతూ ఏడుస్తున్నాను. రైలు వెళ్ళిపోయింది. అంతే, ఆనాటి బావను మళ్ళీ నేను చూడలేకపోయాను.

తర్వాత ఆరు సంవత్సరాల వరకూ బావ ఒక్కసారైనా రాలేదు. ఉత్తరాలు మాత్రం వారానికొకటైనా వచ్చేది. అందులో సగం నా గురించే ఉండేది. ఒకరోజు బావ వస్తున్నట్లు ఉత్తరం వచ్చింది. అందరి ఆనందానికీ అంతులేదు.

బావ వస్తున్నాడు! ఆ వారం రోజులూ నా ఆలోచనలు బావను గురించే.

అనుకున్న రోజుకు బావ వచ్చాడు. ఆ రోజు ఇల్లంతా పండగలాగ పచ్చపచ్చగా ఉంది. బావతో మాట్లాడాలంటే వెధవ సిగ్గొకటి పుట్టి ముంచుకొచ్చింది. నన్ను చూస్తూనే బావ "అరే, లలితా! ఎంత పెద్దదానివయ్యావు?" అన్నాడు. నేను సిగ్గుతో గదిలోకి పరిగెత్తాను.

బావ వచ్చినప్పటినుండి ఇల్లంతా పరమానందంగా వున్నది. నేను బావతో మాట్లాడటానికి సిగ్గుపడుతుంటే, అమ్మా, అక్కా కోప్పడేవారు. బావ నాతో మాట్లాడటానికి ఎంతో ఉత్సాహాన్ని కనబరిచేవాడు. ఎంత ప్రయత్నించినా నాకు ఈ బావ నా చిన్నప్పటి బావ అనుకో బుద్ధి పుట్టేది కాదు. బావ చూపుల్లో, మాటల్లో ఏదో నిగూఢమైన ఆకాంక్ష దాగి ఉన్నట్లు తోచేది నాకు. రోజు రోజుకూ నాకు బావ అంటే ఏదో ఏవగింపు కలగసాగింది.

ఒకరోజు అమ్మ బావకు కాఫీ ఇచ్చి రమ్మన్నది. బావ కాఫీ గ్లాసు అందుకుంటూ నా చేతిని గట్టిగా అదుముతూ అదోలాగ నవ్వుతూ నా ముఖంలోకి చూశాడు. నా వళ్ళంతా అసహ్యంతో కూడిన భయంతో కంపించిపోయింది. బావ పిలుపునుకూడ వినిపించుకోకుండా అక్కడనుండి వెళ్ళిపోయాను. అంతే, మళ్ళీ ఒంటరిగా బావ ఎదుట పడలేదు.

ఇలా నెలరోజులు గడిచాయి. అక్క ఎందుకో దిగులుగా ఉన్నట్లు గమనించాను. ఒకరోజు బావ అక్కను ఏదో అంటున్నాడు. అక్క ఏడుస్తూంది. బావ బయటికెళ్ళిం తర్వాత అక్కను అడిగి తెలుసుకున్నాను. అక్క అంటే బావకు అసహ్యం కలుగుతుందట. లావుగా పొట్టిగా ఉండే ఆడవాళ్ళంటే బావకు అసహ్యమట. ఏదో కల్పించుకుని రోజూ ఇలాగే తిడుతూంటాడట. అక్క ఏడుస్తుంటే నాకూ ఏడుపు వచ్చింది. అమ్మా, నాన్నా బాధపడతారని చెప్పలేదు.

తర్వాత కొద్ది రోజులకు బావకు బెంగుళూరులో పోలీసు ఇన్‌స్పెక్టరు పని వచ్చింది. బావ బెంగుళూరు వెళ్ళిపోయాడు. ఇల్లు దొరికిన తర్వాత అక్కను తీసుకెళతానని అమ్మా,

నాన్నలతో చెప్పాడు. అక్కకూ నాకూ మాత్రం ఏదో సందేహంతో కూడిన భయం కలిగింది.

ఆరు నెలలు గడిచినా బావ అక్కను తీసుకెళ్ళే ఎత్తేమీ కన్పించలేదు. నాన్న రాసే ఉత్తరాలకు ఏదో సాకు చెబుతూ రాస్తూండేవాడు. అక్క ఉత్తరాలకు జవాబే లేదు. అక్క ఎప్పుడూ ఏడుస్తుండేది. అమ్మా, నాన్నా దిగులుపడ్డారు. బావలోని మార్పుని తెలుసుకొని నేనూ ఎన్నో రాత్రిళ్లు యేడ్చేదాన్ని. నా చిన్నప్పటి బావను మళ్ళీ పొందలేనా? అనే భావన నా హృదయాన్ని కలచివేసేది. నేను సిక్త్సు ఫారం చదివే రోజుల్లో అలా ఉండటానికి కారణం అక్క దీనస్థితి, బావలోని మార్పూ, ముఖ్యంగా ఆడపిల్లలనుగన్న మా అమ్మా నాన్నల కడుపుకోత చూస్తుండటమే.

బావ దగ్గరనుంచి ఉత్తరాలు కూడ రావటంలేదు. నాన్నకు చాలా కాలంనుండీ గుండెజబ్బు ఉన్నది. అక్క గురించి దిగులే నాన్న ఆకస్మిక మరణానికి కారణం.

నాన్న చనిపోగానే బావకు టెలిగ్రాం ఇచ్చాము. బావ వస్తాడని అక్కకుకాని, నాకుకాని యే కోశానా నమ్మకంలేదు.

మేము అనుకున్నట్లుగాక బావ తెల్లవారేటప్పటికి వచ్చాడు. నాన్న శవం దగ్గర చిన్న పిల్లవాడిలాగ యేడ్చాడు. అక్కనూ, నన్నూ ఉద్దేశించి ఇంతకుముందు తనవల్ల యేమైనా కష్టం కలిగివుంటే క్షమించమని అడిగాడు. ఆ రోజు బావను చూస్తుంటే నా చిన్ననాటి బావ జ్ఞాపకం వచ్చాడు.

బావ అందర్నీ బెంగుళూరు రమ్మన్నాడు. నాకూ, అమ్మకూ ఇష్టం లేదు. కాని వెళ్ళక ఇక్కడ చేసేది మాత్రమేముంది? మగదిక్కా? లేక పెద్దలు సంపాదించిన ఆస్తా? అందరమూ బెంగుళూరు వెళ్ళాము.

మొదట బావ మమ్మల్ని చాలా గౌరవంగా, ప్రేమగా చూశాడు. క్రమక్రమంగా నాకు మళ్ళీ బావలో మార్పు కన్పించసాగింది. ఈసారి మార్పు అక్కకుగాని అమ్మకుగాని తెలియదు. బావ నన్ను ఎలాగయినా తన వశం చేసుకోవాలనే కోర్కెను ప్రతి పనిలోనూ, మాటలోనూ స్పష్టం చేస్తుండేవాడు.

అక్కకూ, నాకూ మంచి మంచి ఖరీదుగల చీరెలు తెచ్చేవాడు. అక్కకు ఆనందం, నాకు బాధ కలిగేవి. అక్క బలవంతంమీద ఆ చీరెలు కట్టుకుంటే బావ ముఖం విప్పారేది. నాకు వంటినిండా తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్టయ్యేది.

నేను వీలయినంతవరకు బావను తప్పుకు తిరుగుతున్నా. ఒకరోజు అక్క బయట చేరింది. అమ్మ కాఫీ యిచ్చింది బావకివ్వమని. బావ వున్న గదిలోకి జంకుతూనే వెళ్ళాను. బావ నా ముఖంలోకి అదోలా అసహ్యంగా చూస్తూ అన్నాడు:

"ఏం లలితా, నేను రాక్షసుణ్ణా? ఎందుకలా నన్ను తప్పుకు తిరుగుతావు? చిన్నప్పుడు నా ఒళ్ళో కూర్చుని ఎంత ముద్దుగా మాటలు చెప్పేదానివి?"

నాకు ఒళ్లు మండి అన్నాను: "నీవు యిప్పుడు నా చిన్నప్పటి బావవు కావు, మారిపోయావు."

"అవును. అప్పుడు నువ్వు వికసించని లేత మొగ్గవు. ఇప్పుడో- పూర్తిగా వికసించిన ఆకర్షణీయమైన పుష్పానివి. దానికి అనుకూలంగానే నేనూ మారాను."

లాగి గూబకు పెట్టి ఒకటేద్దామా అన్నంత కోపమొచ్చింది. కాని వెంటనే నేను ఉంటున్నది ఆ నీచుని యింట్లోనే అనే విషయం జ్ఞాపకం వచ్చింది. కొంచెం తమా

యించుకుని మంచి మాటలతో మార్చప్రయత్నించటమే మంచిదని అన్నాను:

"ఇలా ప్రవర్తించటం నీకు న్యాయం కాదు బావా! అక్కకూ, నాకూకూడా అన్యాయం చేసినవాడివవుతావు."

"ఇందులో అన్యాయమేముంది. ఇద్దరూ ఒక్కచోటే ఉండవచ్చు. కూటికి తక్కువా, గుడ్డకు తక్కువా? నీ కిష్టమయితే- మీ అక్క..."

"ఛీ, పశువా! నోరుమూయి" అన్నాను కోపంతో వణికిపోతూ. ఇంక ఒక్క క్షణం అక్కడ నిల్చోకుండా వెనక్కి తిరిగిన నా చేయి గట్టిగా పట్టుకున్నాడు. ఇంతలో ఎవరో వస్తున్న శబ్దం విని నా చేయి వదిలి ఏమీ జరగనట్లు బయటకు వెళ్ళిపోయాడు.

ఆ రోజంతా అన్నం తినకుండా కుమిలి కుమిలి ఏడ్చాను. ఎలాగయినా బావ యింటినుంచి వెళ్ళిపోవటమే మంచిదని నిర్ణయించుకున్నాను. ఎక్కడైనా ఒక చిన్న ఉద్యోగం చూసుకుని అమ్మా, నేనూ వీలయినంత త్వరలో వెళ్ళిపోవాలనుకున్నాము.

ఆ తర్వాత బావ నాతోకాని, బావతో నేనుకాని మాట్లాడలేదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తుండేవాడు. సరిగా భోజనం కూడా చేయటంలేదు. అక్క బావకు ఏదైనా జబ్బు చేసి వుండవచ్చునని భయపడుతూంది. రోజు రోజూ దీర్ఘాలోచనలో మునిగి ఉండే బావను చూస్తుంటే, పశ్చాత్తాపం కలిగి ఉండవచ్చుననుకున్నాను. ఒక్కోరోజు బావను చూస్తుంటే జాలి కలిగేదికూడా.

ఎంత మంచి సంబంధాలు వచ్చినా కాకుండా చేసేవాడు. అమ్మ బావకు ఎదురు చెప్పలేక చాటున ఏడుస్తుండేది. ఒకరోజు రాత్రి అక్కకు బాగా జ్వరం. భరించలేని తలనొప్పితో బాధపడుతోంది. బావ డాక్టరు దగ్గరకెళ్ళి మందు తెచ్చాడు. బావ ముఖం చూస్తుంటే ఏదో భయంకర కార్యాన్ని చేయబోయేవానిలాగ ఉన్నది. ఆ ముఖంలో మూర్తీభవించిన రాక్షసత్వం, కరడు కట్టిన కాఠిన్యం కన్పిస్తున్నవి. ఎర్రగా భీతిని గొల్పే కళ్ళతో, క్రింద పెదివిని పండ్లతో కొరుకుతూ నొసలు ముడిచి నా వంక చూస్తూ, వణుకుతున్న చేతుల్తో అక్కకు మందు తాగిస్తున్న బావను చూస్తుంటే నా శరీరం భయంతో వణికిపోయింది.

జేబునుండి ఒక చిన్న పొట్లం తీసి నా ముందు వేస్తూ "ఆ కణిక అరగదీసి కండ్లలో వేయి. తలనొప్పి తగ్గుతుంద"ని చెప్పి తుఫాను పెనుగాలిలో ఊగే మహావృక్షంలాగ ఊగుతూ వెళుతున్న బావను చూస్తున్న నా శరీరమంతా తిమ్మిరెక్కిపోయింది.

అక్క మూలుగుతూంది. మందు సీసా చేతిలోకి తీసుకుని పరీక్ష చేశాను. డాక్టరు పేరూ, మందుపేరూ (క్వినైన్) రాసి వుంది. నా భయానికీ అనవసరంగా చాలా క్రూరంగా బావమీద అనుమానం కలిగినందుకు నన్ను నేనే నిందించుకున్నా. అక్క కండ్లలో మందువేసి పడుకోటానికి వెళ్ళాను.

తెల్లవారుతూనే ఇంట్లో ఏడుపులు విని వులిక్కిపడి లేచాను. నా శరీరం భయంతో కొయ్యబారిపోయింది. ఎలాగ వెళ్ళానో నాకే తెలియకుండా అక్క మంచం దగ్గరకు చేరుకున్నాను.

అక్క కాళ్ళు క్రింద పెట్టుకుని మంచంమీద కూర్చుని ఉన్నది. అమ్మ గోడకు తల బాదుకుంటూ ఏడుస్తూంది. బావ అక్క వడిలో తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. అంతా బాగానే... బ్రతికే వున్నారు. మరి యీ యేడ్పులకు కారణం?

ఇంతలో బావ అక్క చేతులు పట్టుకుని ఏడుస్తూ అంటున్నాడు– "అయ్యో, ఎంత పని చేశాను? డాక్టరు తలకు పట్టువేయమంటే నేనే పరధ్యానంగా కండ్లలో వేయమన్నాను. నా వేలుతో నా కన్ను నేనే పొడు..."

ఇంక వినలేకపోయాను. కాళ్ళ క్రింద భూమి కదిలిపోతున్నది. ఇంటి గోడలు ఊగుతున్నట్టున్నవి. అక్కకు కండ్లు కన్పించటంలేదు అని అర్థం చేసుకున్నాను. పిచ్చిదానిలాగ అరిచాను– "అంతా పచ్చి అబద్ధం. ఈ దుర్మార్గుడే చేశాడింతా. అందుకే యేడ్చే మగవాళ్ళనూ, నవ్వే ఆడవాళ్ళనూ నమ్మకూడదంటారు."

భర్తనే దైవంగా పూజించే అక్కకు నా మాటలు ములుకుల్లాగ గ్రుచ్చుకున్నాయి. "లలితా! నోరుమూయి" అన్నది అక్క.

వడిలో తలపెట్టుకుని పిల్లవాడిలాగ యేడుస్తున్న బావ తలను నిమురుతూ అన్నది: "ఊరుకోండి. పొరపాటుకు మీరేం చేస్తారు? ఏ జన్మలో నేనెవరి కళ్ళు పోగొట్టానో, యీ జన్మలో అనుభవిస్తాను. మీ రెండు కళ్ళే నాకూ కళ్ళు. అవి బాగున్నంతవరకూ నాకు ఏ లోటూ లేదు."

నేను ఇంక అక్కడ నిల్చోలేకపోయాను. ఆ రోజంతా గదినుంచి బయటకు రాలేదు. హృదయం పగిలిపోతున్నది, అక్కను తల్చుకున్నకొద్దీ.

ఎంతోమంది డాక్టర్లు చూసి 'లాభంలేదు, చూపు రాదని' చెప్పారు. క్రమంగా అంతా అలవాటు పడుతుంది. అక్క గుడ్డితనం నన్ను బాధపెట్టినంత అక్కను బాధపెట్టటంలేదు. అమ్మ ఆ దిగుల్తోనే మంచానపడి ఆరు నెలల్లో అన్ని కష్టాలను విరగడ చేసుకుని వెళ్ళిపోయింది. ఇంటిభారమంతా నామీదే పడింది.

రోజులు పీడకలలలాగా గడిచిపోతున్నాయి. సంవత్సరం గిర్రున తిరిగిపోయింది. ఈ సంవత్సరం రోజులూ బావ నా ముందు అపరాధిలాగా ప్రవర్తించాడు. నన్ను తప్పుకు తిరిగేవాడు. నిర్జీవంగా అందరం రోజులు గడుపుతున్నాము.

ఒకరోజు రాత్రి అక్క గదినుండి మాటలు వినిపిస్తున్నాయి. బావ నాకు విన్పించాలని కాబోలు పెద్ద పెద్దగా మాట్లాడుతున్నాడు...

"నాకు మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని ఇష్టంలేదు. కాని లలిత పెండ్లీ పెటాకులూ లేకుండా ఎన్ని రోజులు మనల్ని కనిపెట్టుకుని ఉంటుంది? ఆ తర్వాత మనల్ని చూసేవాళ్ళెవరు?"

"గుడ్డిదానితో ఎన్ని రోజులు జీవితాన్ని వెళ్ళబుచ్చుతారు? మీరు తప్పక పెండ్లి చేసుకోండి."

"అప్పుడు నీ గతేంకావాలి? పరాయిదాన్ని చేసుకుంటే; ఎంత మంచిదయినా సవితిని దయతో చూడలేదు."

"మరి అయినవాళ్ళెవరున్నారు? నా కర్మ ఎలావుంటే అలా జరుగుతుంది, నా గురించి ఆలోచించకండి."

"లలిత అయితే నీకూ బాగుంటుంది, నాకూ నిన్ను గురించి దిగులుండదు."

"ఆఁ– లలితా! అది చేసుకుంటుందా? అదీకాక చిన్నపిల్ల."

"అయితే నేను ముసలివాణ్ణనేగా నీ ఉద్దేశం? నాకు ఆవిడమీద మోజు ఉండికాదు. నీ కోసమే" అన్నాడు కొంచెం కటుస్వరంతో.

"మీరు ముసలివాళ్ళనీ, దానికి తగరనీ అనలేదు. దానికిష్టమయితే నా అభ్యంతరమేమీ లేదు. అయినా రేపు దాన్ని కనుక్కుంటాను. అంతకంటే నాకు సంతోషమైనదేముందీ ఇక నా జీవితంలో. ఇద్దరమూ ఒకచోటే ఉంటాము." అక్క స్వరం దుఃఖంతో పూడుకుపోతున్నది. ఆపై మాటలు నాకు వినిపించలేదు. వెక్కిళ్ళు మాత్రం వినిపిస్తున్నాయి.

నా తల తిరిగిపోతున్నది. ఆ నీచుడు చివరకు ఎంత తెలివిగా, తేలిగ్గా కుట్ర పన్ని తన కోర్కెను తీర్చుకోజూస్తున్నాడు. ఎలాగయినా ఆ రాక్షసుడినుండి తప్పించుకోవాలి. రాత్రి పన్నెండు గంటలకు తలుపు తీసుకుని బయటకు వచ్చాను. ఎక్కడకు పోవాలి? ఏం జేయాలి? ఈ విశాల ప్రపంచంలో ఆదరించేవారెవరు? అందులో పద్దెనిమి సంవత్సరాల యువతిని. చిన్నప్పటినుండి పెంచిన బావే ఇంత నీచంగా ప్రవర్తిస్తే ఇతరులు ఇంకెంత నీచంగా చూస్తారు! ఈ ప్రపంచంలో స్త్రీ వంటరిగా, గౌరవంగా బ్రతకటానికి వీలుందా? లేదు. అప్పుడు నేనేం చేయాలి? ఆత్మహత్యకంటే వేరే గత్యంతరం లేదనుకుంటూ దొడ్లోని బావి దగ్గరకు వెళ్ళాను.

కళ్ళముందు నా గుడ్డి అక్క! అక్కను మెడమీద చెయ్యిపెట్టి నెడుతున్న యువతి- కాదు, ఆమె సవతి... అబ్బ- ఆ దృశ్యం ఎంత భయంకరంగా ఉంది?

నా తరువాత అక్క గతి ఇంతేనా? ఛీ. చావటం పిరికితనం. నేను కష్టించి అక్కను బ్రతికించగలను. కాని ఒకటవ క్లాసునుండి పతికంటే సతులకు వేరేగతి లేదని నూరిపోయబడిన అక్క వస్తుందా తన పతిని విడిచి? తన ప్రపంచమంతా; జీవితమంతా అంధకారబంధురం చేసిన బావను పల్లెత్తుమాట అనని అక్క వస్తుందా యిల్లు వదిలి? నా వల్లనే అక్క జీవితం నాశనమైంది ఇలాంటి సమయంలో దిక్కులేని అనాధగా అక్కను ఆ రాక్షసుని చేతుల్లో పెట్టి వెళ్ళిపోవటమా లేక కామాంధునికి-నా శరీరాన్ని-జీవితాన్ని...

ఇక అక్కడ నిల్చోలేకపోయాను. గదిలోకి పరుగెత్తికెళ్ళి ఎంతోసేపు గట్టిగా ఏడ్చాను. రేపు అక్క అడుగుతుంది. జవాబు చెప్పాలి. ఏమని?

నా హృదయంలోని ఆవేదనను ఇంక అణచలేకపోయాను. నీకు నా హృదయాన్ని దహించే అగ్నిజ్వాలలను చూపించకుండా ఉండలేకపోయాను. ఇదే నీకు నా మొదటి ఉత్తరమూ, చివరిదికూడా. ఇంక. శలవు.

ఇట్లు,

నీ లలిత"

ఇంతలో "క్షమించు జానీ! మా అక్క, బావ యీ రోజే బాంబేనుండి వచ్చారు. అందువల్ల త్వరగా రాలేకపోయాను" అంటూ పద్మ లోపల ప్రవేశించింది. "అరే, ఎందుకు ఏడుస్తున్నావూ?" అన్నది నన్ను ఆశ్చర్యంగా చూస్తూ. బరువెక్కిన హృదయంతో, వణుకుతున్న చేతుల్తో ఆ ఉత్తరాన్ని పద్మకు అందించాను.

ఆరోజు మొదలు "బావ" అన్న ఆ రెండు అక్షరాల పేరు విన్నప్పుడల్లా నా హృదయం ఆవేదనతో బరువెక్కిపోతుంది.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక-1953)